కృతి సమర్పణము

శ్రీ రావూరు వేంకటసత్యనారాయణ

"ఆషాఢ మేఘాలమాటున దాగి తొంగి చూచే అర్ధచంద్రుడిలాగు, నిమీలిత నేత్రాలతో నా కామె దర్శన మిచ్చింది. పచ్చిపోకలు పండుటాకులు, దోసిట బట్టి నా కర్పించి, మంచిగంధం, మల్లెదండలు పూల సజ్జలో వుంచి నా కందించి నమస్కరించింది

"అస లెవరండీ ఆవిడ ?"

"విను లలితా! చెపుతున్నాను. తరువాత ఆవిడ నాదగ్గిర వున్న కుర్చీలో కూర్చుని ఇలా చెప్పింది. మీరు కవులు! నిరంకుశులు! జగత్కల్యాణానికి, దేశాభ్యుదయానికి కారణభూతులు. భాషా సామ్రాజ్యానికి పట్టభద్రులు కవులకలం తుప్పుపడితే కాలచక్రపు ఇరుసే కదలదు. ప్రకృతి పస్తుపడిపోతుంది. మీరంతా కన్ను తెరచి కలం పుచ్చుకోకపోతే సృష్టికర్తకే కునికిపాట్లు వచ్చేటట్లున్నాయి. తొందర పడండి! లేవండి—కావ్యాలు వ్రాయండి! కథలు సృష్టించండి. ఆకలి డొక్కల్లో చీకటి కళ్లల్లో, చిట్లిన గుండెల్లో మీ కవిత్వపు జల్లులు కురిపించండి. పలుకుల రాణిని పల్లకీలో ఊరేగించండి—"

"ఈఉపన్యాసమంతా ఎవరిదండీ !—"

"నేనన్నా కదా ! అమ్మా! నువ్వు లక్ష్మీ దేవివో, సరస్వతీమాతవో నా కర్థంకాలేదు. నీపలుకులు నా హృదయంలో అజ్ఞానపు కోటను పడగొట్టి జ్ఞానపీఠాన్ని ప్రతిష్ఠించినాయి. ఇది కలికాలం. కవులను ప్రతిభను గుర్తించే ప్రజలు గౌరవించే ప్రభువులు కరవయ్యారు. కవులవంక చూచిన వారికి శిక్ష! సంఘం వారికి పిచ్చివా రని బిరుదు ఇస్తుంది. పత్రికలకు పంపితే పరాభవం-ఇలాంటి కాలంలో వ్రాసి ఏమిచేసేది తల్లి? అయినా నీఆజ్ఞ" అని ప్రార్థించాను."

"ఏదో తేనెతుట్ట కవగొట్టారుమల్లీ. అస లెవరితోనండీ ఈ రగడంతా?"

"అదే చెప్పుతున్నా లలితా!" నా మాటలు విని ఆవిడ తనలో తను నవ్వుకుంది. కాసేపు నావంక తేరిపారి చూచింది. ఆమె చూపులు కలువలదండలై నాకంఠాన్ని అలంకరించినయి. ఆమెచిరునవ్వులు సేసలై నాశిరస్సున రాలినయి. ఆమె లేచి తనచేతులు నా తలపైవుంచి ఇలాదీవించింది. నువ్వుఅమాయకుడవు. లోకంలో నీవొకమార్గం, ఒకఆదరణ చూచుకొని కవిత్వం వ్రాయడ మేమిటి? లోకాని కొక క్రొత్తమార్గం నువ్వు చూపించాలి. నీ అడుగులలో అడుగువేస్తూ ప్రకృతి వెంటపడి లేగదూడలాగు పరుగెత్తుకొని వస్తుంది. అధైర్యం పనికిరాదు. ఒక గ్రంథం వ్రాయి - ఆదరించేవారూ - అంకితం అందుకొనేవారూ కరవుకారు. నువ్వు గ్రంథం వ్రాయి. అంకితం పుచ్చుకునేవారు సిద్ధంగానే

వున్నారు. వెంటనే గ్రంథం అచ్చు వేయించు. వారికర్పించు-లోకం మెచ్చుకోలు లందిస్తుంది. త్వరపడు-అంటూ ఆవిడ మన తోటలోకి నడిచి వెళ్లింది.

"తోట కూడా ఒకటి వేయించా రేమిటి నాకు చెప్పకుండా?"

"విను లలితా! నేనూ ఆ తోటలోకి పరుగెత్తాను. పిట్టలు చెట్లమీదనుంచి లేచి నప్పుడు కొమ్మలు కదలి నాతలమీద పూల వర్ష ంకురిసింది. ఆమె మందార చెట్లలోకిపోయి మాయమైంది. ఆకొమ్మల్లో కొమ్మేఅయిందో, పూవులలో పూవే అయిందో, పున్నం వెన్నెట్లో అలగా నేమారిందో అర్థంకాక తిరిగి వచ్చాను."

"పిచ్చి కుదిరింది. రోకలి తలకు చుట్ట మన్నట్లున్నది కథ! ఈ నిద్రకళ్లతో ఎంత సేపని ఈ మొదలు చివరా లేని 'మొల్ల' రామాయణం వినేది; ఆ తూరుపుదిక్కున తొగరుమబ్బులలోనుంచి తొంగి చూచే సూర్య దేవుడికి వినిపించండి మీకథ. అస్తమానం వింటాడు - కావాలంటే - రోజూ వచ్చి వినిపోతాడు. విసు గతనికి వుండదు.

"లలితా! అయిపోయింది. రాత్రి కలలో జరిగిన కథ ఇది. కథలు కల్లలు కావు. గ్రంథ రచన ప్రారంభమాతుం దీనాడే!—కృతిసమర్పణ మహోత్సవాని కెదురుచూస్తుంటారట. సరస్వతీ దేవే నాకు ప్రత్యక్ష మైనపుడు-ఇక సంశయ మెందుకు?

"అజ్ఞాతంలో వున్న ఒక మహాకవికి అభ్యుత్థానమిచ్చి కవిత్వపీఠానికి ఆహ్వానించి విశ్వవిపంచి శ్రుతులు కదలించి, సరస్వతీ దేవి చరితార్థత చెందింది. ఏదీ మీా తొలిగీతం?"

౨

కాలు తెగిన గొర్రెపిల్ల నడకలాగు కలం పరుగెత్తడం లేదు లలితా! మొదటవున్న ఉత్సాహం, ఇప్పుడు కనిపించడం లేదు. పంతానపడి ప్రాకులాడుతోంది హృదయం. కాస్త టీ కాచి తీసుకురాగలవా?

"దేవిని స్మరించండి, ఆమె వ్రాయిస్తుంది- లేదా వ్రాసిపోతుంది. గ్రంథం మొదలు పెట్టినప్పటినుంచి కళ్లల్లో వత్తులు వేసుకొని కూర్చున్నారు. కాని పాపం, నిరుపహతిస్థలంబు-"

"లలితా! ఆగు. ఒక క్రొత్తభావం తట్టింది. ఈ పరుగులో పదిపుటలన్నా దాటు తవి. త్వరగా టీ కాయి లలితా!"

"అలాగే కాస్తాను వ్రాయండి! పాపట బొట్టులో ముత్యాలు కూర్చినట్లు... దేవుని కంఠమాలగా బొడ్డుమల్లెలు కూర్చినట్లు... పసిపాప బుగ్గల్లో పాలవెన్నెల నురుగులు విరిసినట్లు-"

"లలితా! అందిస్తూవుండు ఉత్సాహాన్ని—సౌందర్య దేవత సరస్వతీ దేవి చెరి ఒక చేయి పట్టుకున్నట్లున్నది నాకిప్పుడు... గ్రంథం త్వరలోనే పూర్తి అవుతుంది. తరువాత కృతిసమర్పణ."

"మరచిపోయినానండి! క్షమించాలి... పంచదార నిండుకున్నా దివ్వేళ. పనిదాన్ని వెళ్లమంటే పసివాడికి సుస్తీగా ఉన్నదని పరుగు తీసింది. ఈలోగా సైకిలు వేసుకు వెళ్లిరండి... పాలు వెచ్చపెట్టా నీలోగా. అందుకనే నిరుపహతి స్థలంబు...అన్నాడు."

౩

"కొమరుముత్యాలు కుంచాలతో కొలిచి ఇవ్వవచ్చే పద్యాలకు. వాగ్దేవత శృంగారగానం కరగి వాహినిగా మారినట్లున్న దీ రచన... తప్పకుండా అచ్చు వేయించండి మొగలిపొత్తాలలాగు అమ్ముడౌతవి. గ్రంథం పే రేమి పెట్టతలచారు?"

"బహుశః స్వప్న జ్యోత్స్న... అవుతుంది. అంతా స్వప్న మేకాదూ?"

"అవునవును. ఆవెన్నెల నిగ్గు లెన్నో వున్నాయి రచనలో. . ఎప్పటికి కావాలి గ్రంథం?"

"మీ రెంత తొందరలో అచ్చువేసి ఇస్తే అంతమేలు . . ఆలస్యమైతే అగరునూనె కూడా ఆముదపువాసనే వేస్తుంది."

"ఆలాగే! ముందు మీపనే అయిపోయే టట్లు చేస్తాను...ఫోటో కూడా వేయిస్తారా?"

"అదీ మీరే చూడండి. అంతా మీదే భారం. పుస్తకాలు చేతికందియ్యడం. . సొమ్ము స్వీకరించడం...అలాటి భారం మీమీద వుంచవచ్చుననే భావాలతోనే ఈ కార్యాలయంలో అడుగుపెట్టాను."

"అలాగే! దానికేమి లెండి. పదిహేను రోజులలో గ్రంథాలు అందుతవి. మీ కృతి సమర్పణ సర్వం సిద్ధంగా వుంచవచ్చు."

"అంత ధైర్య మీయగలిగితే ఇంకేం కావాలి? వెళ్లివస్తాను."

"ఆగండి మీ ఫొటోతీసుకుంటాం"

౪

"లలితా! గ్రంథం అచ్చుపడి ప్రెస్‌లో నిద్రపోతోంది. కృతిస్వీకారాని కెవరూ కనుపించ లేదు. ప్రెస్ మేనేజరుగారు తొందర చేస్తున్నారు. పెట్టిన గడువులు నాలుగింటిని గడపలలాగు దాటివచ్చాను. ఇవ్వాళ, రేపు చూచి, తనే వాటి నెవరికో, వచ్చినంత ధరకే అమ్మి సొమ్ము జమకట్టుకుంటానని ఆయన చెప్పాడు ఇవ్వాళ. కర్తవ్యం నా కేమీ తోచడంలేదు. కాకిపుండుమీద గ్రద్దవాలి నట్లయింది లలితా చివరకు"

"అధైర్యం పడకండి. దేవిపలుకులు వృథా కావు. ఎవరో ఒకరు మీ కడ్డుపడక పోరు. ఇంకా ప్రయత్నించండి. వీలైతే ఒక ప్రకటన కూడా చేయండి."

"అదీ చేసి చూచాను లలితా! వంద పుస్తకాలు వేరే ముందుగా తీసుకొని పెద్ద లందరికీ పంపాను... జవాబులు వచ్చినంత వరకు నిరాశను మూట గట్టుకొని వచ్చి నాయి..."

"ప్రెస్ మేనేజరుగారిని కొంతకాలం ఆగ మని చెప్పి చూడకపోయారా?"

"చెప్పాను సర్వవిధాలా ప్రయత్నించాను. ఆయన అలా తేలికగా వప్పుకునే టట్లా లేడు. కావ్యమాధుర్యంవిలువ వారి కేం కావాలి. బిల్లు ముట్టితే చాలు!"

"పోనీ! అంతగా అయితే పుస్తకాలు ఆయన్నే తీసుకోమనండి — అంకితం కూడా ఆయనకే ఇవ్వండి. దేవిదయ ఎలా ఉన్నదో అలా అవుతుంది."

"లలితా...అది యెలా సాధ్య మవుతుంది? పవిత్రమైన కవితావస్తువును, అంత తేలికగా అంత నీచంగా, త్యజించిన పాపం వేయి నల్లత్రాచులై నా మెడను చుట్టుకోవూ."

"గత్యంతరం లేనప్పుడు, గన్నేరే కల్ప వృక్షం. కాలం, కర్మం తప్పివస్తే 'ఆ' అన వలసినచోట 'అహా' అనాలి. చేయి కాలిన తరువాత ఆకులు వెతకడం దేనికి ? ముందే తొందరపడితే మంచిదికాదూ ? "

"అంతా ఆ దేవి దయ."

౫

"కవిగారూ! మావారు పైకంకోసం మిమ్మల్ని నిర్బంధించినందుకు క్షమించండి. వ్యాపారంలోపడ్డవాళ్లకు వేపాకు తాంబూల మని శాస్త్రం ఉండనే వుంది. ఆయనమాట అలా వుంచండి. ఇవ్వాళ మీతో ఒక మాట చెప్పదలచి పిలిచాను. దానికి మీరు అంగీకరిస్తా నంటే-"

"చెప్పండి; నా కెందు కమ్మా కోపం— సొమ్ము ఇవ్వలేకపోవడం లోపం నాది గాని మేనేజరుగారి దెందు కౌతుంది?"

"సొమ్ము మాట వదిలివేయండి బాబు! ఆ బాకీ మీరు తీర్చేశారనుకోండి—లేకపోతే మీతరఫున నేనే ముట్టచెప్పా ననుకోండి. సొమ్ము విషయంలో ఆయన చేసిన ఒత్తిడి ఒక అన్నో, తమ్ముడో తెలియక చేసినపని అనుకోండి. నామాట వినండి"

"అలా ఎలా అనుకోగలనమ్మా! తెచ్చి ఇస్తాను. ఇవ్వాళతప్పితే రేపు. ఋణం మరో లోకంలోకి పోయినా తప్పేదా తల్లి."

"అది వదలి నామాట వినండి బాబు! మీ గ్రంథం ఈరోజున చదివించి విన్నాను. గ్రంథం చదువుతూవుంటే నారోగపుగుండెల్లో రుధిరజ్వాల లుప్పొంగి తరంగా లైనాయి. ఆనందరహితంగా, ఏదో ఒక కాంక్షతో ఈలోకంలో ప్రాకులాడుతూన్న నాజీవితానికీ గ్రంథం ఒక పూలతెప్పగా కనుపించింది. ప్రేమసామ్రాజ్యంలో - పనికిరాని బంటుగా పడివున్న నాకు మీకవిత్వం కమ్మని గానమై వినిపించింది. కష్టాలలో తీపి సుఖంలో సారు జోడుగుర్రాలై పరుగులెత్తినాయి నాకళ్ల ముందు. నాజీవిత స్వప్నంలో స్థిరమైన ఒక జ్యోతి గోచరించింది. అబ్బా!"

"శ్రమపడకమ్మా! నాపాలిట 'వెతుక బోయిన తీగవై'నావు. మీ హృదయంలో గల జాలి, రసపిపాస, ఈ కవిత్వానికి కానుక లైనాయి. నాకలం ధన్యమైంది. ఒక్క హృదయానికైనా ఒడ్డులు వొరసుకొనే ఆనందాన్ని అందింపకలిగింది నా కవిత్వ మన్నమాట కూడా విని నిజానికి నే నింకా బ్రతుకగల ననుకోలేదు. ఈ సంతోషంతోనే నా కన్నులు మూతపడితే కమ్మని ఆశ ఒకటి నావెంట పడి స్వర్గసీమల్లో దింపివస్తుందేమో తల్లీ!"

"నా కథంతా నిరాశావీచికలతో నిండిన ఒక తుపాను. యౌవనపు ఓడ తెర చాప లెత్తి జీవితసాగరంలో ఒకఘడియ ప్రయాణించిందో లేదో ఇంతలోనే ఈ రుగ్మతాపిశాచి నన్నావరించింది. కుహూపిని చేసింది. శుష్కజీవిని చేసింది. అప్పటి నుంచీ ఈ రోగపుమంచమే నా ప్రపంచం. ఇదే బ్రతుకు. ఇక చాలాకాలం బ్రతకడం అసంభవ మని ఒకవార్త నా చెవిలో ఇల్లు కట్టుకొని పలుకుతోంది. ఇదివరలో నా కంటికి దూరంగా కనుపించే చీకటితెరలు నా దగ్గఱకు జరిగివస్తున్నాయి. నాజీవితలత చిగిర్చినట్లుగా ఒక ఆశ మెఱుపుగా ప్రకాశించిం దీగ్రంథంలో. చిట్లిపోయిన ఈ మూగ

వీణమీద చిన్నిచేతు లేవో కదలి గంధర్వగాన మాలపించినట్లున్నది. ఈ గ్రంథాన్ని నా కంకిత మివ్వండి. దానిని మిగిలిన జీవితమంతా గుండెలమీద దాచుకొని బ్రతుకుతాను."

౬

"పూర్వజన్మసుకృతబల మేదో నన్నీ గ్రంథాన్ని వీరికి అంకిత మీయవలసిందిగా ఏర్పరచి వుంచింది. కవిత్వకన్య ఈయమ గుండెల్లో పట్టుపాన్పులమీద పవళించివుంది. ఈ గ్రంథంతో ఈ ప్రేమ హృదయానికి వ్యజనసేవ చేయడమే నా కోరిక. కాలం మారింది. కవులు అస్పృశ్యులైనారు. గ్రంథాలు బలహీనంగా పరిణమిస్తున్నాయి. ఈ నిరాశలో ఈయమ ఒక ఆశాజ్యోతి నా ముందు అవతరించింది—ఈ పవిత్రహృదయానికి అంకితంగా, ఈమెజీవితాని కుంకుమగా, ఈమెరసాత్మకు ఉడుగరగా ఈ కావ్యం సమర్పిస్తున్నాను.

(సభలో హర్షధ్వనులు)

"ఈయమ కవిత్వమూర్తి! నాకు కలలో కనుపించి నన్నీ కావ్యరచనకు ప్రోత్సహించిన సరస్వతీదేవి శుష్కచ్ఛాయలే ఈమెలో గోచరిస్తున్నాయి. అందువల్లనే ఈమెకీ కుసుమదామం అర్పిస్తున్నాను.

(సభలో చప్పట్లు.)

"నా గ్రంథరచనకు ఒక పవిత్రహృదయం బంగారుపంటలు పండించుకున్న దని వినినప్పుడు నాకు కలిగిన ఆనందం గర్వాంనే నెలా చెప్పగలను?

(సుకృతం, సుకృతం.)

ఈ కావ్యంలో గల పద్యాలన్నీ అన్ని మహాకావ్యాలై వెలసినా ఈమె స్వీకరించడానికి అర్హత కలిగివుంది. యౌవనపు మిసమిసలు లేక ఆరోగ్యభాగం కోల్పోయి, శుష్కమైన అస్థిపంజరంలో పడివుండి ప్రపంచపుదృష్టిలో అభాగ్యపుజీవిగా పరిగణింపబడే హృదయంలోకూడా అనంతమైన జ్యోతీ, వెలుగూ— విశ్వాన్ని ముంచెత్త కలిగేది వున్నదని రూపించడమే ఈ కావ్య సంకల్పం.

(సభలో కోలాహలం)

"కొన్నిపద్యాలు మచ్చుకు చదివినవి విన్నారు మీరు. ఇప్పుడు కృతిపతిగారు కొద్దిగా ముచ్చటిస్తారు. ఒక్కమాట - అనారోగ్యంతో కాగితపుపడవలాగు బలహీనమైవున్నా వీరీ ఉత్సాహ సమయంలో, సంతోషాన్నే బలంగా స్వీకరించి వచ్చారిక్కడకు. వారి ఉపన్యాసం శాంతంగా విని ఆనందించవలసివున్నది."

(చప్పట్లు-సందడి)

"ఈ మహోత్సవ సమయంలో నేను మాట్లాడడ మనేది - సాహసమే అయినా - అవసరమైన పని అయింది. నాలో వున్న ఉత్సాహం ఉద్రేకం - నన్ను నిలబెట్టకలిగినాయి మీముందు. ఈ కావ్యాన్ని నేను అంకితం తీసుకోవడం చంద్రుణ్ణి తలపువ్వుగా ధరించడమే అవుతుంది. కాని ఇది నాచివర కోరికను తీర్చుకోవడమే అవుతుంది. నాజీవితచ్ఛాయలు-కవిగారు సెలవిచ్చినట్లు నామూగవీణశ్రుతులు తిరిగి మీటినట్లుగా ఈకావ్యంలో చిత్రించినకొన్నిభాగాలు నాకు తోచినవి. ఈశుష్కజీవితంలో పొడచూపిన నిరాశ, దైన్యం, దౌర్భాగ్యం, వడగాడుపులు అన్నీ ఈ రెండుఅట్టలమధ్య ఒక క్రొత్తవెలుగును పోగుచేసుకొని దాగివున్నాయి. జీవితంలో

• భాగస్వామినినిగా వెలసి-రవ్వంతసౌఖ్యాన్ని, సహాయాన్ని ఇవ్వలేకపోయిన నేను నా స్వరూపంగానే ఈ గ్రంథాన్ని నా భర్త కర్పించి నిష్కృతి పొందదలచాను. ఈ గ్రంథాన్ని నా కంకిత మిచ్చిన కవిగారిని తిరిగి వేయి సారులు అభినందిస్తున్నాను తప్ప లేదంటే— ఆశీర్వదిస్తున్నాను. కావ్యవస్తువును, ఔచిత్యాన్ని, రసపోషణను గురించి మాట్లాడాలంటే నాకు బలం చాలదు. నాశరీర మంతా బాంగరమైపోతున్నది. పొంగిపొరలే సంతోష సముద్రతరంగాలలో నే నొక పూవు నైపోయాను. నేను కృతిభర్త ననే వాక్యం ఎదురైన వేల్పులకు వినిపిస్తూ, దీనిలో పద్యాలు వారికి చదివి వినిపిస్తూ... పూలమెట్లమీద ప్రయాణిస్తూ పోగలను... ఇంతకన్న ఈ సమయంలో నేనేమి చెప్పగలను...కృతి కర్తకు, నాభర్తకు... సభాసదులకు మరియొకసారి నమస్కరిస్తున్నాను. ఈ కావ్యాన్ని నాకళ్ల కద్దుకుని - మీ సెలవు పుచ్చుకుంటున్నాను.



గనేరి యాకు

నేటి సుప్రసిద్ధ ఔషధం

ఇంగ్లీషు మరియు యితర నాటువైద్యములకు మీ చర్మవ్యాధి నివారణ కాక పుచ్చుకొన్న యింజెక్షన్లు నిష్ప్రయోజనమై యుండినయడల మేము తయారు చేసిన నేటి "గోనోకిల్లర్"ను వాడిచూడుడు. ఈ సుప్రసిద్ధమందు అన్నివిధముల చర్మబాధలను శీఘ్రకాలములో తొలగించి మీకు సౌఖ్యమునిచ్చును. యిది, **స్త్రీ పురుషులయొక్క,** మూత్రజాడ్యములకును చీముతోగూడిన వివిధరకముల **గనేరియా-మేహరోగము,** తెలుపుపోవుట, వాపు, వీర్యముపోవుట, పొక్కులు యీ మొదలయినవి దీనివలన నివారణయగును. వేలకొలది జనులు మా మందును వాడి సౌఖ్యము పొందినారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులు యానందించినారు. కాలము పోగొట్టక మీరు యీ మందును వకసారి వుపయోగించి యానందము పొందండి.

50 మాత్రల బుడ్డి యొకటికి రూ. 3/-మాత్రమే. వి. పి. పి. ప్రత్యేకము అణాలు 8.

Sole Manufacturer:-DR. D. N. JASANI, (Dpt.A.P.) Vithalbhai Patel Road, BOMBAY 4.

Madras Stockists: - APPAH & Co., CHINA BAZAR.